రేవంత్, దామోదర దూరం.. దూరం!

- వైద్యశాఖ మంత్రి లేకుండానే దవాఖానపై సీఎం సమీక్ష
- ఉస్మానియా దవాఖాన డిజైన్ల పరిశీలన.. శంకుస్థాపనపై చర్చ
- మంత్రి స్థానికంగా ఉన్నా సమాచారం ఇవ్వని సీఎంవో

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మధ్య దూరం మరింత పెరిగిందా?.. అంటే ప్రస్తుత పరిణామాలను బట్టి అవుననే అనిపిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరుకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీచేశారు. అయితే.. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లేకుండానే ఈ సమీక్ష నిర్వహించారు. పైగా.. మంత్రి దామోదర శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్లలోనే అందుబాటులో ఉన్నారు. అయినా సమీక్షకు మంత్రిని ఆహ్వానించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి దామోదరకు కొంత గ్యాప్ ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. తాను ఉమ్మడి రాష్ట్రంలోనే డిప్యూటీ సీఎంగా పనిచేశానని, రేవంత్‌రెడ్డి తనకన్నా చాలా జూనియర్ అని దామోదర పదేపదే తన సన్నిహితుల దగ్గర వ్యాఖ్యానిస్తుంటారని మొదటి నుంచీ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం తెలిసినప్పటి నుంచి ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చినట్టు తెలుస్తున్నది. దీనికి తగ్గట్టే సీఎం ఇతర శాఖల్లో లోటుపాట్లపై నేరుగా సమీక్షించి, నిర్ణయాలు చెప్పేవారు. కానీ వైద్యారోగ్య శాఖపై మాత్రం మంత్రి దామోదర అనుమతి తీసుకున్న తర్వాతే సమీక్షించేవారని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. కానీ శనివారం మంత్రి లేకుండానే దవాఖానపై సమీక్షించడం దేనికి సంకేతం అనే చర్చ మొదలైంది.

జూపల్లిని పిలిచి.. దామోదరను మరిచి

వాస్తవానికి ఉస్మానియా దవాఖానను హోంశాఖకు చెందిన భూమిలో నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సమీక్షలో పాల్గొన్నారు. కానీ వైద్యారోగ్య శాఖ నుంచి ఏ ఒక్క అధికారి కూడా పాల్గొనలేదు. వైద్యశాఖ మంత్రి, అధికారులు లేకపోయినా దవాఖాన డిజైన్లను సీఎం పరిశీలించారు. డిజైన్లలో మార్పులు, చేర్పులను సూచించారని సీఎంవో తెలిపింది. ఉస్మానియాపై సీఎం సమీక్షిస్తున్నారనే సమాచారం కూడా మంత్రికి లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీఎంవో నుంచి ప్రెస్‌నోట్ వచ్చిన తర్వాతే వారికి విషయం తెలిసిందని అంటున్నారు. సీఎం రేవంత్ ఎక్సైజ్, విద్యుత్తు శాఖలపైనా నిర్వహించిన సమీక్షలో ఆ శాఖ మంత్రులు జూపల్లి, భట్టి పాల్గొన్నారు. కానీ వైద్యశాఖ సమీక్షలో మంత్రి దామోదరను దూరం పెట్టడంపై చర్చ మొదలైంది.

నిజామాబాద్‌లో వైద్యం కోసం భార్యను భుజాన వేసుకుని దవాఖానలో తిరుగుతున్న బిద్యానాయక్

బర్త్‌డే వేడుకల్లో సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

దవాఖాననా? ఫంక్షన్ హాలా?

- చాంబర్‌లో అట్టహాసంగా సూపరింటెండెంట్ బర్త్‌డే
- బొకేలు, బహుమతులు, ఫొటో షూట్లు, వీడియోలు..
- 'మేడమ్'ను ప్రసన్నం చేసుకునేందుకు సిబ్బంది క్యూ
- రోగిని భుజాన వేసుకుని ఏడంతస్తులు తిరిగిన బాధితుడు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో వైద్యాధికారుల ఇష్టారాజ్యం

హైదరాబాద్/ఖలీల్‌వాడి, జనవరి 11 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన శుక్రవారం రాత్రి ఫంక్షన్‌హాల్‌గా మారిపోయింది. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తన చాంబర్‌ను ఫంక్షన్‌హాల్‌గా మార్చేశారు. రంగురంగుల అలంకరణలు, బెలూన్లు, ధగధగ మెరిసే లైట్ల మధ్య అట్టహాసంగా తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. భారీ కేకు, బొకేలు, బహుమతులు, ఫొటో షూట్లు, వీడియోలు ఇలా ఫంక్షన్‌హాల్‌కు ఏమాత్రం తీసిపోకుండా చాంబర్‌లో వేడుకలు జరిగిపోయాయి. 'యథారాజ.. తథా ప్రజ' అన్నట్టు.. సిబ్బంది కూడా తమ 'మేడమ్'ను ప్రసన్నం చేసుకునేందుకు చాంబర్‌ను అలంకరించడమే కాకుండా, శుభాకాంక్షలు చెప్పేందుకు క్యూ కట్టారు. మొత్తంగా కొన్ని గంటలపాటు సూపరింటెండెంట్ చాంబర్‌తోపాటు ఆ పరిసరాలన్నీ ఫంక్షన్ హాల్‌ను తలపించాయి.

ఓ వైపు వేడుకలు జరుగుతుండగా.. శుక్రవారం రాత్రి రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన కేతావత్ బిద్యానాయక్ ఫిట్స్ వచ్చిన భార్యను తీసుకొని దవాఖానకు పరిగెత్తుకొని వచ్చారు. సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో స్ట్రెచర్‌గానీ, వీల్‌చైర్‌గానీ లభించలేదు. దీంతో భార్యను భుజాలపై వేసుకొని లోపలికి వెళ్లాడు. లోపల డాక్టర్లుగానీ, సిబ్బందిగానీ ఎవరూ కనిపించలేదు. అందరూ 'మేడమ్' చాంబర్ వద్దనే ఉన్నారు. దవాఖానలోని ఏడు అంతస్తులు తిరిగినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఆయన చొరవతో అర్ధరాత్రి తర్వాత వైద్యులు బాధితురాలిని చేర్చుకొని చికిత్స అందించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఇతర రోగులు సైతం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. అయితే బాధితుడు రోగిని భుజాన వేసుకుని దవాఖాన మొత్తం తిరుగుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయంపై వివరణ కోరేందుకు సూపరింటెండెంట్‌ను సంప్రదించగా ఆమె స్పందించలేదు. నిజామాబాద్ దవాఖాన ఫంక్షన్ హాల్‌గా మారడం ఇదే మొదటిసారి కాదని స్థానికులు చెప్తున్నారు. నిరుడు కూడా ఇదే స్థాయిలో వేడుకలు జరిగాయని, రంగురంగుల డెకరేషన్, స్పార్కిల్స్ గన్, కేక్ వంటివాటితో హంగామా చేశారని అంటున్నారు.

నిలోఫర్‌లోనూ..

హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానలోనూ ఇటీవల ఇలాంటి ఘటనలు జరిగాయి. వైద్యాధికారుల బర్త్‌డేలు అట్టహాసంగా నిర్వహించారు. కేకులు, బహుమతులతో హంగామా చేశారు. నిలోఫర్ దవాఖాన ఫొటోషూట్ కేంద్రంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఓ వైద్యాధికారి దవాఖాన మెయిన్ గేటు ముందే ప్రజాప్రతినిధుల స్టైల్‌లో ఫొటో షూటు చేయించుకున్నారు. దీనిని సోషల్ మీడియాలోనూ అప్‌లోడ్ చేశారు. ఈ విషయం తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

ఉస్మానియా డిజైన్లను సిద్ధం చేయండి

- నెలాఖరులోగా శంకుస్థాపన జరగాలి
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజైన్లు ఉండాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): గోషామహల్‌లో ఉస్మానియా దవాఖాన కొత్త భవనాల నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా దవాఖాన నిర్మాణంపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శనివారం సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యారోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దవాఖాన నిర్మాణానికి సంబంధించిన నమూనా మ్యాప్‌లను పరిశీలించిన సీఎం పలు మార్పుచేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా డిజైన్లను రూపొందించాలని పేర్కొన్నారు. రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్కు లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ మేరకు డిజైన్లను రూపొందించాలని అధికారులకు సూచించారు.

2030 కల్లా 418 కిలోటన్నుల గ్రీన్ హైడ్రోజన్

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. 2030 కల్లా గ్రీన్ హైడ్రోజన్‌ను ఏడాదికి 418 కిలో టన్నులు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సోలార్ విద్యుత్తు ఉత్పాదక సామర్థ్యాన్ని 2023కి 19వేల మెగావాట్లకు, 2035 కల్లా 26,374 మెగావాట్లకు చేర్చాలని నిర్దేశించుకుంది.

గ్రేటర్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్తు కేబుళ్లు!

గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్తు కేబుళ్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. విదేశాల్లోని ఉత్తమ పాలసీని పరిశీలించి రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల పూర్తిగా అండర్‌గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

మాంజా దారంపై నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులను ఎగురవేసేవారు సింథటిక్ మాంజా/నైలాన్ దారాలను వినియోగించకుండా నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మాంజా దారం తయారీ, విక్రయాలను నిషేధిస్తూ 2017లో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన తీర్పును పకడ్బందీగా అమలు చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్‌జీటీ తీర్పు అమలు కావడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై అటవీ, పర్యావరణ, హోం శాఖల ముఖ్య కార్యదర్శులతోపాటు డీజీపీకి ఇటీవల నోటీసులు జారీ చేసిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి.. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

158 మంది మాజీ సైనికులకు ఉద్యోగాలు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): జాబ్‌మేళాలో 158 మంది మాజీ సైనికులకు ఉద్యోగాలు లభించినట్టు రక్షణ శాఖ శనివారం తెలిపింది. మ్యూజిక్ బస్ ఫౌండేషన్, ఫ్యాక్ట్ సెట్ రీసెర్చ్‌సిస్, తెలంగాణ ఓవర్సీస్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ప్రైవేట్ కంపెనీల సహకారంతో జాబ్‌మేళాను నిర్వహించినట్టు పేర్కొన్నది. 233 మంది ఇంటర్వ్యూలకు హాజరవ్వగా 158 మందికి ఉద్యోగాలు లభించినట్టు తెలిపింది.

పూల రవీందర్‌కు జీజేఎల్‌ఏ, టీజీసీటీఏ మద్దతు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు రెండు సంఘాలు మద్దతు తెలిపాయి. గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జీజేఎల్ఏ), తెలంగాణ డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) సంఘాలు మద్దతు ప్రకటించాయి. జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, టీజీసీటీఏ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్ శనివారం పూల రవీందర్‌ను కలిసి మద్దతు లేఖను అందజేశారు. జూనియర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్లంతా మొదటి ప్రాధాన్య ఓటును పూలరవీందర్‌కు వేసి గెలిపించాలని వారు కోరారు.

పీఎస్సీ సదస్సుకు హైదరాబాద్ ఆతిథ్యం

డిసెంబర్‌లో 26వ సదస్సు నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : పలు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) చైర్‌పర్సన్ల నేషనల్ కాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో 26వ సదస్సును హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ నిర్వహించనుంది. శనివారం బెంగళూరులో నిర్వహించిన 25వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం బెంగళూరులో ప్రారంభించగా.. కర్ణాటక గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్, సీఎం సిద్ధరామయ్య, యూపీఎస్సీ చైర్‌పర్సన్ ప్రీతి సుడాన్ హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై చర్చించారు.

యువరైతు ఆత్మహత్య

- కాలం కలిసి రాక.. అప్పులు భరించలేక
- ఆదిలాబాద్ జిల్లాలో అన్నదాత బలవన్మరణం

శంకర్ (ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 11 : కాలం కలిసి రాక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం పిప్రి గ్రామానికి చెందిన కినక శంకర్ (38) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయ పెట్టుబడికి తెలిసిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. అతివృష్టి కారణంగా దిగుబడి రాకపోవడంతో తీసుకున్న అప్పు తీర్చిలేకపోయాడు. డబ్బులు చెల్లించాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి పెంచాడు. దీంతో శంకర్ మద్యానికి బానిసయ్యాడు. అప్పు చెల్లించే మార్గం లేక తాగిన మైకంలో గత నెల 31న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పది రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు.

దశలవారీగా హామీల అమలు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జనవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల హామీలను ఆర్థిక వెసులుబాటు చూసుకొని దశలవారీగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆడపడుచులకు గృహలక్ష్మి పథకం కింద ఇస్తామని చెప్పిన రూ.2,500, యువతులకు పెళ్లి సమయంలో ఇచ్చే తులం బంగారం, విద్యార్థులకు ద్విచక్ర వాహనాలను సైతం విడతల వారీగా ఇస్తామని వెల్లడించారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేయనున్నట్టు చెప్పారు. ఖమ్మం జిల్లా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం పత్రికల్లో చూశామని, విచారణకు ఆ శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. సంక్రాంతి సెలవుల తర్వాత అధికారులు పూర్తిస్థాయి విచారణ చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 28లోగా భూ భారతిని అమలులోకి తెస్తామని చెప్పారు.

గురుకులాలకూ కామన్ ఎంట్రెన్స్

పోస్టర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జనవరి11 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు ఇకపై కామన్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. పోస్టర్‌ను ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 23న రాతపరీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా సొసైటీల కార్యదర్శులు అలగు వర్షిణి, సైదులు, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి

అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం

హైదరాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయం, గోదావరి సంగమ తీరంలో ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ నది అంతర్వాహిని పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. శనివారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మాణాలను శాశ్వత ప్రాతిపదికన అత్యాధునిక వసతులతో కళాత్మకంగా రూపొందించాలని స్పష్టంచేశారు. 'ప్రభుత్వం కేటాయించిన రూ. 25 కోట్లతో స్నానఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన తదితర పనులను వేగంగా పూర్తిచేయాలి. పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేయాలి. కాళేశ్వరంలో అత్యాధునిక, ఆకర్షణీయమైన నూతన బస్‌స్టేషన్‌ను నిర్మించాలి. వీధి దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. ఫిబ్రవరి 7 నుంచి 19 వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం పనులను పకడ్బందీగా చేపట్టాలి.' అని మంత్రి అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, టూరిజం ఎండీ ప్రకాశ్ పాల్గొన్నారు.

మద్యం ధరల పెంపుపై దొంగాట!

- లిక్కర్ రేట్ల పెంపునకు ఇప్పటికే సర్కారు నిర్ణయం!
- 6 నెలల కిందనే ఐదుగురు సభ్యుల కమిటీ సిఫారసు
- ప్రభుత్వం, కంపెనీల మధ్య ఉత్తుత్తి భిన్నాభిప్రాయాలు!
- ప్రజలను తప్పదోవ పట్టించేందుకే విభేదాల నాటకం!
- బీర్ల సరఫరా నిలిపివేస్తామని ప్రముఖ కంపెనీ వెల్లడి
- కంపెనీలపై నెపం నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం!

హైదరాబాద్, జనవరి11 (నమస్తే తెలంగాణ): మద్యం ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. కానీ ధరల పెంపుపై ఇంకా కసరత్తు చేస్తున్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీలు కోరిన మేరకు ధరలు చెల్లించేందుకు ప్రభుత్వం ఎప్పుడో రంగం సిద్ధంచేసిందని, ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను తప్పించుకునేలా పథకం ప్రకారం వ్యవహరిస్తున్నట్టు మద్యం వ్యాపారవర్గాల్లో చర్చ జరుగుతున్నది. మద్యం ధరలు పెంచాలని కంపెనీల నుంచి విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం హైకోర్టు మాజీన్యాయమూర్తి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల కమిటీని ఆరు నెలల క్రితమే ఏర్పాటు చేసింది. ఈ కమిటీ జూలై 18న తొలిసారి సమావేశమైంది. జూలై 25లోగా మద్యం కంపెనీలు సరఫరాకు ధరలు కోట్ చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. అదేనెల 26న సీల్డ్ కవర్లు తెరిచి కంపెనీలు కోట్ చేసిన ధరలను చూసింది. 91 కంపెనీలు మద్యం సరఫరాకు ముందుకు వచ్చాయని, బీరు, బ్రాందీ, విస్కీ, రమ్, వైన్, విదేశీ మద్యం సహా మొత్తం 1032 బ్రాండ్లకు ధర కోట్ చేశాయని ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అత్యంత ప్రజాదరణ కలిగిన బీర్ల కంపెనీతో పాటు సోమ్ డిస్టిలరీ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర కంపెనీలు, హైదరాబాద్ లోకల్ కంపెనీలు కూడా ఉన్నాయి.

ఓ పెద్ద కంపెనీతో కలిసి పెద్దల నాటకం!

మద్యం మార్కెట్‌లో దాదాపు 60 శాతం వాటా ఉన్న ఓ బీర్ల కంపెనీ తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 30 శాతం అదనపు ధర చెల్లించాలని కోట్ చేసిందని, ఈ కంపెనీ డిమాండ్‌నే ఇతర కంపెనీలు అనుసరించాయని తెలుస్తున్నది. ధర పెంచాలని మద్యం కంపెనీలు కోరడం, ప్రభుత్వం తిరస్కరించటం తరచుగా జరుగుతూ ఉంటుంది. 2023లో కూడా మద్యం కంపెనీలు బేసిక్ ధర పెంచాలని కోరగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తిరస్కరించింది. కానీ ఇప్పుడు మద్యం ధరలు పెంచడానికే కాంగ్రెస్ ప్రభుత్వం మెగ్గు చూపున్నట్టు సమాచారం. కానీ ప్రజల నుంచి వ్యతిరేకతను తప్పించుకునేందుకు ప్రభుత్వ పెద్దలు కొత్త ఎత్తుగడ వేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధరల పెంపునకు ప్రభుత్వ పెద్దలు ముందుగా తిరస్కరించారని, ఓ ప్రముఖ కంపెనీ సరఫరా నిలిపివేస్తున్నట్టు ప్రకటించినందున, తప్పనిసరి పరిస్థితుల్లో ధరలు పెంచాల్సి వచ్చిందనేలా పథకం ప్రకారం వ్యవహరిస్తున్నట్టు మద్యం వ్యాపార వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీఎం హడావుడి మీటింగ్ ఎందుకు?

ఒప్పందం ఉల్లంఘిస్తూ సరఫరా నిలిపివేసే ఏదైనా మద్యం కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని న్యాయనిపుణులు చెప్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం సదరు బీర్ల కంపెనీపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఆ కంపెనీని బూచిగా చూపుతూ ప్రజలపై భారం మోపడానికే పెద్దలు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన ఎక్సైజ్‌శాఖ సమావేశం కూడా ప్రణాళికలో భాగంగానే జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మద్యం ధరల పెంపుపై నిర్ణయం తీసుకోండి

- నిర్ణయ కమిటీ నివేదికలే ఆధారం
- కొత్త కంపెనీల అప్లికేషన్లు తీసుకోండి
- అనుమతుల్లో జాగ్రత్తలు పాటించాలి
- పాత కంపెనీలు పెట్టే డిమాండ్‌కు తలొగ్గొద్దు
- ఎక్సైజ్‌శాఖ సమీక్షలో అధికారులతో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): మద్యం ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖను ఆదేశించారు. హైకోర్టు మాజీన్యాయమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధరల నిర్ణయ కమిటీ ఇచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకోవాలని సూచించారు. శనివారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, ఎక్సైజ్‌శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణలో మద్యం సరఫరా చేయాలని ఆసక్తితో ఉన్న కొత్త కంపెనీల నుంచి అప్లికేషన్లకు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని, కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే టీజీబీసీఎల్‌కు మద్యం సరఫరా చేస్తున్న కంపెనీలు, కొత్త బ్రాండ్లు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని చెప్పారు. కొత్త కంపెనీలకు అనుమతిచ్చే విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి, అధికారులను సీఎం ఆదేశించారు.

పాత కంపెనీలకు తలొగ్గేది లేదు

యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ(కింగ్ ఫిషర్) బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాత కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని, పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లోని బీర్ల ధరలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైకోర్టు మాజీన్యాయమూర్తి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పీ శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కులగణనలో బీసీల లెక్కలు తేలిన తర్వాత కూడా రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి అభ్యంతరం ఏమిటని